సిఐటియు మండల కమిటీ ఎన్నిక

కన్వీనర్ జి.కళావతి కో కన్వీనర్ కె.సోమేష్

ప్రజాశక్తి- అనంతగిరి:అనంతగిరి సిఐటియు మండల సమావేశం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు పూర్వ నాయకులు, జట్టీటీకే సభ్యులు దీసరి గంగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అంగన్వాడి కార్యకర్తలకు తక్షణ వేతన పథకం వర్తింప చేయాలన్నారు. టూరిజం శాఖలో పని చేస్తున్న ఆప్కాస్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అల్లూరి జిల్లాలో 732 మంది సిహెచ్డబ్ల్యూలను ఆశావర్కర్లుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం సిఐటియు మండల కన్వీనర్గా జి.కళావతి, కో కన్వీనర్గా కిల్లో సోమేష్, 18 కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కిల్లో మొస్యా, కమిటీ సభ్యులు సాగర సుమిత్ర, సునీత, చిలకమ్మ, రఘురామ్, డి. బుద్దురాజు, వివిధ సంఘం నాయకులు మహేష్, లింగమూర్తి, ఆశావర్కర్ల సంఘం నాయకులు అప్పలమ్మ, సుందరి, భవన నిర్మాణ సంఘం నాయకులు ఎస్.నాగేశ్వరరావు, పి.మద్దు ..లక్ష్మణరావు పాల్గొన్నారు.

సిపిఎం నేతల అరెస్టు దుర్మార్గం: సిఐటియు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్ ప్రజా అభిప్రాయ సేకరణకు వెళ్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథంను అక్రమ అరెస్టును సిఐటియు అల్లూరి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.ఉమామహేశ్వరరావు, బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో రసాయన పరిశ్రమలతో ఇప్పటికే అక్కడ నివసిస్తున్న ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల ఆమోదం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం బల్క్ డ్రగ్ పార్కును నిర్మించాలని చూస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన సిపిఎం నాయకులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

టూ వీలర్ మెకానిక్ సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి ఆధ్వర్యంలో కళాశాలలో టూవీలర్, ఆటో మెకానిక్ శిక్షణ కార్యక్రమం చేపట్టారు. దీనిని బుధవారం ఎస్ఐ వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఒక గంట శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 45రోజుల తరువాత సర్టిఫికెట్ అందిస్తారని పేర్కొన్నారు. ఎక్కువమంది విద్యార్థులు ఈ సర్టిఫికెట్ కోర్సులో జాయిన్ కావాలని కోరారు. విద్యార్థులు బైక్ నడిపేటప్పుడు లైసెన్స్ కలిగి ఉండాలని, బైకుల రిపేరింగ్ కూడా తెలుసుకొని ఉంటే మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.రమణ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జల్ జీవన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ కిన్నంగుడ గ్రామంలో జరుగుతున్న జల్ జీవన్ పథకం పనులను బుధవారం స్థానిక సర్పంచ్ గెమ్మెల చిన్నబాబు పరిశీలించారు.ఈ సందర్భంగా సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ కిన్నంగుడ గ్రామంలో త్రాగు నీరు లేక కిలోమీటర్ దూరం ఉన్న ఊట నీరు తీసుకొచ్చి తాగునీరు ఉపయోగించుకుంటున్నారు. గ్రామంలో జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభించి సంవత్సరాలు కావస్తున్నా పూర్తి చేయకపోవడంతో గ్రామస్తులు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే సంబంధిత గుత్తేదారులు జల్ జీవన్ పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కుమిడి ప్రదీప్, కొర్ర కొములు, డి రాజ్ కుమార్, వార్డు మెంబర్ రాము, కిన్నాం రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట మండల సర్వసభ్య సమావేశంలో..

సమస్యలపై నిలదీత

మండల సభలో సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సభాధ్యక్షులు ఎంపీపీ కూడ రాజులబాబు అధ్యక్షతన ముఖ్య అతిథిగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం హాజరయ్యారు. మండలంలో రెవెన్యూశాఖ అధికారులు దొంగ పట్టాలు సృష్టిస్తున్నారని దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో విద్యార్థులకు రక్షణ లేదని,మరుగుదొడ్లు లేక గిరిజన ఇబ్బంది పడుతున్నారని పలువురు సభ్యులు ప్రశ్నించారు.

వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల నిర్లక్ష్యంతో సబ్సిడీ ఎరువులు అందలేదని, ఉప్ప, హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ టెస్టింగ్ కిట్లు లేక పోవడంపై వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు నిలదీశారు.నక్కలపుట్టు గ్రామానికి అంగన్ వాడి సెంటర్ మంజూరు చేయాలన్నారు. మట్టు జోరు, జర్రా కొండ సర్పంచ్ లు సాంబ, కొర్ర చిట్టిబాబు మాట్లాడుతూ, బాలికల హాస్టల్స్కు ఆదివారం పూట..ఆకతాయిలు వస్తున్నారని, పోలీస్ ల తో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వైసిపి సభ్యుల కొండలరావు మాట్లాడుతూ సమస్యలు తెలపడం తప్పా పరిష్కారానికి మార్గం చూపించలేదన్నారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రైతులకు అందించేందుకు అధికారులు పూర్తిగా పనిచేయాలన్నారు. రేషన్ బియ్యం, పెన్షన్ల విషయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో వాహనాల ద్వారా ఇంటికే రేషన్ బియ్యం సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసి ప్రజలను కష్టాల పాలు చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, ఏవో సన్యాసిరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు, సీడీపీఓ సువర్ణమ్మ, ఏటీ డబ్ల్యూఓ అఖిల, ఎంఈఓ బాబూరావు, ఏఈ సంజీవ రావు, ఎంపీటీసీలు, సర్పంచ్లు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డలకు ఆరోగ్యం

అరకులోయలో అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ శారద

ప్రజాశక్తి-అరకులోయ:తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అరకులోయ సిడిపిఓ కే..శారద అన్నారు. మండలంలోని హట్టగూడ అంగన్వాడి కేంద్రములో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలతో బిడ్డకే కాకుండా, తల్లికి కూడా మేలు జరుగుతుందన్నారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లిపాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు విజయ, సీత, వంజన, నోయిన, సూపర్వైజర్లు లక్ష్మీ, స్వర్ణ, రామకృష్ణమ్మ పాల్గొన్నారు.

చింతపల్లి : శిశువులకు తల్లి పాలు ఇవ్వడం వలన తల్లీ, బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని అన్నవరం సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.లక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అన్నవరం అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువులకు తల్లి పాలు పట్టడం వలన తల్లీబిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరనుందని తెలిపారు. కార్యక్రమంలో లోతుగెడ్డ పీహెచ్సి సీహెచ్ఓ ఈవీ రమణ, ఎంపీహెచ్ఏ బాలమణి, అన్నవరం సచివాలయం ఏఎన్ఎం లావణ్య, అంగన్వాడీ సిబ్బంది పి.పెంటమ్మ, కె.శాంతి, కె.నాగమణి, ఎన్.ముత్యాలమ్మ, ఎం.పూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు

పిల్లల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- పాడేరు:పాడేరు డి.ఈ.ఐ.సి ఆర్బిఎస్కే 'రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి లో - బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. టి. విశ్వేశ్వర్నాయుడు మాట్లాడుతూ. ఎం.ఎల్.హెచ్.పి/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు, సిడిపిఓ/సూపర్వైజర్లకు పిల్లల పెంపక సంరక్షణ, కుటుంబము వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ, పిల్లల పోషణ కోసం ఫ్రేమ్ వర్క్ ను రూపొందించామన్నారు. ఆరోగ్యం, ఆహారం, ఆటతో అభివృద్ధి, ప్రతిస్పందించే సంరక్షణ, సురక్షణ అనే విషయాల మీద అవగాహన కల్పించారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా ప్రోగ్రాం అధికారి ఆర్ బిఎస్కే టి ఎన్ ప్రతాప్ మాట్లాడుతూ, ఆశ, ఏఎన్ఎం, అంగన్వాడి కార్యకర్తలు, ఎం.ఎల్.హెచ్.పి/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, సిడిపిఓలు విధి నిర్వహణలో ఎంతో కీలకంగా ఉండాలని తెలియజేశారు. ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాంలో భాగముగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రతి అంగన్వాడి ప్రతి స్కూల్లో చదువుతున్న పిల్లలను క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేయవలసినదిగా ఆదేశించారు. అనారోగ్యం ఉంటే వెంటనే జి.జి.హెచ్ (పాడేరు)లో ఉన్న డీఈఐసి సెంటర్ కు రిఫర్ చేయవలసిందిగా తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ గ్రీష్మ, మెడికల్ ఆఫీసర్ వై. కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

దాడిలో టిడిపి నేతకు గాయాలు

చికిత్స పొందుతున్న త్రినాథ్

ప్రజాశక్తి- పెదబయలు : భూ వివాదం విషయంలో టిడిపి మాజీ అధ్యక్షులు లొట్టి త్రినాథ్ (చిన్ని)పై దాడి చేయడంతో గాయాలయ్యాయి. మండలంలోని సీతగుంట పంచాయతీ కేంద్రంలో గిరిజనుడికి, వ్యాపారస్తుడైన గిరిజనేతరునికి మధ్య బుధవారం మధ్యాహ్నం భూ వివాదం విషయంపై వాగ్వివాదం చోటుచేసుకుంది. లకేపుట్టు గ్రామానికి చెందిన పాంగి రోశ్యన్న కుమారుడు తన అనుచరులు కలసి గిరిజనేతరుడైన టిడిపి నేత లొట్టి త్రినాథ్ (చిన్ని)పై దాడి చేశారు. దీంతో తలపై గాయాలయ్యాయి. దాడి చేసిన వ్యక్తులే పోలీసు స్టేషన్కు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి గాయపడిన త్రినాథ్ను చికిత్స నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో ముంచింగిపుట్టు ఎస్ఐ శాఖపరమైన చర్యలు తీసుకోనున్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

బదిలీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సహచరులు

ప్రజాశక్తి అనంతగిరి:మండలంలోని చిలకలగెడ్డ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు డి.గాసి, కెఎస్ఆర్. అమర్నాథ్లను ప్రధానోపాధ్యాయులు సైమన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా హెచ్ఎం సైమన్, ఉపాధ్యాయుడు రాంబాబులు మాట్లాడుతూ,ఉన్నతమైన విద్యను అందించారని కొనియాడారు. పాఠశాల టీచర్లు లక్ష్మణరావు, మత్స్యరాజు, శేఖర్, సంతోష్, కన్యాకుమారి, రమణి పాల్గొన్నారు.

గురుకులంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-పెదబయలు : స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ డి.శంకర్రావు ఆధ్వర్యంలో పిడి గిరిప్రసాద్, పిఈటి డి.రాంబాబు విద్యార్థులు ఆటల పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు మాత్రమే గ్రౌండ్లో ఉండాలని, మిగిలిన వారు తరగతి గదులల్లో ఉండాలని విద్యార్థులకు సూచించారు.

వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

జీడిగుప్పలో సమావేశమైన ఉపాధివేతనదారులు

ఉపాధి పనుల నిబంధనలు సవరించాలి

- సిపిఎం నాయకులు కొండారెడ్డి

ప్రజాశక్తి- విఆర్పురం: మండలంలోని జీడిగుప్ప పంచాయతీలో ఈ సంవత్సరం జరిగిన ఉపాధి పనులు చేసిన కూలీలకు మూడు వారాలు మస్టర్లు ఆన్లైన్ చేయలేదు దీంతో ఉపాధి వేతనదారులు ఆందోళన చెందుతున్నారు. జీడిగుప్పలో ఉపాధి వేతనదారులు బుధవారం సమావేశమయ్యారు. గ్రామంలో నెట్వర్క్ సరిగా ఉండదని (సిగ్నల్స్) కానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు పూటలా పని చేయాలని ఉన్నా ఈ ప్రాంత పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మండల అధికారులు పై అధికారులకు పరిస్థితిని వివరించాల్సింది పోయి నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సిపిఎం మండల నాయకులు కొండారెడ్డి మాట్లాడుతూ 8 వారాల నుంచి పేమెంట్ లేక ఇబ్బంది ఉపాధి వేతనదారులు ఇబ్బంది పడుతున్నారని త్వరగా పేమెంట్లు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు పూటలా మస్టర్ తొలగించి వెంటనే పేమెంట్ చేయని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు కల్లేపల్లి ఖాదర్బాబు, గిరిజన సంఘం నాయకులు కనుగుల చిన్న వెంకటరెడ్డి, శాఖ సభ్యురాలు మౌనిక గ్రామపెద్దలు ఉపాధివేతనదారులు పాల్గొన్నారు.

బూమ్ బాక్స్ మ్యూజిక్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్ ఆధ్వర్యాన అన్ని స్ట్రీమింగ్ ప్లాట్ ఫారంలలో రాయల్ బూమ్ బాక్స్ మ్యూజికల్ కార్యక్రమం జరగనుందని గాయకుడు అర్మాన్ మలిక్ తెలిపారు. విశాఖలోని ఒక ప్రయివేటు హోటల్లో బుధవారం ఆయన మాట్లాడుతూ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్, యూనివర్సల్ మ్యూజిక్ గ్రూప్ సహకారంలో, బూమ్ బాక్స్ ఒరిజినల్స్ ఒక తాజా లైన్-అప్తో మరలా ముందుకు వచ్చిందన్నారు. ఇది మెలొడీని, హిప్-హాప్ను రంగరించే ఫార్మాట్ అని పేర్కొన్నారు. పెహ్లే జైసీ బాత్ నహీ, హువాడీ, మొహబ్బత్, ఇమ్తిహాన్ వంటి విజయవంతమైన ట్రాక్స్ తర్వాత ఈ ప్లాట్ ఫారం ఇప్పుడు, ఈ సీజన్లో తన మూడవ ఒరిజనల్ను మేబి అర్మాన్ మలిక్ , ఇక్కాల శక్తివంతమైన కొలాబరేషన్ ను ముందుకు తెస్తోందన్నారు. గత మూడేళ్లుగా శక్తివంతమైన ఆన్-గ్రౌండ్ అనుభవాలతో, పలు యూత్ హబ్ ల వ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తూ వివిధ శైలులను, స్వరాలను, సంస్కృతులను మేళవిస్తూ, ఇది సాగుతోందని వివరించారు.

రాఖీ సందర్భంగా డిజిటల్ గిఫ్ట్ కార్డ్స్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తమ ఇ గిఫ్ట్ కార్డ్స్ కోసం కొత్త వ్యక్తిగత ఫీచర్ అమేజాన్ పే డిజిటల్ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు గిఫ్టింగ్ స్టోర్డ్ వేల్యూ డైరెక్టర్ జి నేహా గుప్తా మహాత్మ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తమ సొంత వ్యక్తిగత ఫోటోలు, ఆర్ట్ వర్క్ను అప్ లోడింగ్ చేయడం ద్వారా గిఫ్ట్ కార్డ్స్ను పొందవచ్చని తెలిపారు. రాఖీని పురస్కరించుకొని అమెజాన్ డాట్ ఇన్ అన్ని పండగ అవసరాల కోసం ఏకైక వేదికగా రక్షా బంధన్ స్టోర్ను పరిచయం చేసిందన్నారు. ఉత్తేజభరితమైన డీల్స్, ఆఫర్లను అందిస్తోందన్నారు. ఈ రక్షా బంధన్కు, పర్యావరణ చైతన్యం కలిగిన కస్టమర్లు విలక్షణమైన విత్తనాలు కలిగిన పేపర్ బహుమతి కార్డ్ను ఎంచుకోవచ్చని చెప్పారు.

బ్రిటీష్ అధికారుల సమాధులను కాపాడాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని బ్రిటిష్ అధికారుల సమాధుల స్థలాన్ని ఆక్రమించిన వారిని తొలగించి, స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకొని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా వారికి అప్పగించాలని కోరుతూ బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం ఎఐడిఎస్ఒ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా, ఎఐడిఎస్ఒ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు అభిలాష్, కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ, 100 ఏళ్ల నాటి చారిత్రక ప్రదేశాలను కాపాడాలని డిమాండ్ చేశారు

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే శిరీషదేవి

బాధితులకు కూరగాయలు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ప్రజాశక్తి - దేవీపట్నం: అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే మరియు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్పర్సన్ శిరీషదేవి హామీ ఇచ్చారు. బుధవారం దేవీపట్నం మండలం ఎస్. రామన్నపాలెం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదంలో కుక్క అప్పయమ్మ, కుక్క వెంకటేశ్వరరావు నిరాశ్రయులయ్యారు. బాధితులను ఎమ్మెల్యే శిరీష పరామర్శించి వారికి బియ్యం, కూరగాయలతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మారిచెట్ల వెంకటేశ్వరావు(బుజ్జి), గోళ్ళ చంటిబాబు, ముంద్రు మధుసూదనరావు, జొన్నల శ్రీనివాస్కుమార్, ఎఎంసి డైరెక్టర్ జొన్నల రాంబాబు, దాకారపు సత్యనారాయణ, సర్పంచ్ కుంజ రాజామణి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై కళాజాతా

అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో బుధవారం ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలు, బాల్యవివాహాలపై ఏర్పడే సమస్యలపై కళాకారులతో సర్పంచ్ దుర్గో ఆధ్వర్యంలో సీలేరు మెయిన్రోడ్లో ప్రజలకు కళాజాత కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. కళాకారులు హాస్యాన్ని పండిస్తూ చెత్తవల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వ్యర్థాలని విడిగా పడవేయడం వలన పర్యావరణంకు విఘాతం కలుగుతుందన్నారు. తడిచెత్త పొడిచెత్త వేరుచేసి డస్ట్బిన్లో ఉంచితే పంచాయతీ క్లాత్మిత్ర సిబ్బంది సేకరించి తరలిస్తారని తెలిపారు. చిన్నతనంలో బాల్యవివాహాలు చేసుకుంటే అనారోగ్యానికి గురై అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. దోమతెరలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపిడిఓ ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు కళాజాత నిర్వహిస్తున్నామని కళాకారులు పేర్కొన్నారు. పంచాయతీ గుమస్తా ప్రకాష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా మెగా రీజనల్ ఇన్వెస్టర్స్ సెమినార్

జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్ పారంభిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) మార్కెట్ మౌలిక సదుపాయాల సంస్థల సహకారంతో కలిసి, టైర్-2, టైర్-3నగరాల్లో పెట్టుబడిదారుల విద్య, అవగాహనను విస్తరించేందుకు 'మెగా ప్రాంతీయ పెట్టుబడిదారుల సెమినార్ల'ను నిర్వహిస్తుంది. ఈ క్రమంలో విశాఖపట్నంలోని విఎంఆర్డిఎ చిల్డ్రన్ ఏరినాలో నిర్వహించిన మెగా రీజినల్ ఇన్వెస్టర్స్ సెమినార్ను 'స్మార్ట్ పెట్టుబడి - సురక్షితమైన భవిష్యత్తు వైపు' పేరుతో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.రామ్మోహన్రావు హాజరై మాట్లాడుతూ, ఆర్థిక అక్షరాస్యత, పెట్టుబడిదారుల రక్షణపై సెబీ అచంచలమైన కట్టుబాటును వివరించారు. మోసపూరిత పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సెక్యూరిటీల వ్యాపారానికి సంబంధించి ఎప్పుడూ సెబీ రిజిస్టర్డ్ మధ్యవర్తులను మాత్రమే వినియోగించాలని పెట్టుబడిదారులను హెచ్చరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న విశాఖపట్నం జిల్లాకలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, మాట్లాడుతూ, ఈ సెమినార్లు, పెట్టుబడిదారులకు సురక్షితమైన, బాధ్యతాయుత పెట్టుబడుల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, సెక్యూరిటీల మార్కెట్లో కొత్తగా ప్రవేశించేవారికి సరికొత్త దిశను చూపిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఎస్ఎ చీఫ్ జనరల్ మేనేజర్ దీప్తి అగర్వాల్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) కృష్ణకాంత్ పటేల్, 800 మందికి పైగా పెట్టుబడిదారులు పాల్గొన్నారు.

విఎంఆర్డిఎ చైర్మన్ను కలిసిన డిఎస్డిఒ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ మెట్రో ప్రాంత అభివృద్ధి సంస్థ (విఎంఆర్డిఎ) చైర్మన్ ఎంవి.ప్రణవగోపాల్ను జిల్లా క్రీడల అధికారి ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలో క్రీడా కార్యక్రమాల నిర్వహణ, వసతులపై చర్చించారు. తమ సంస్థ ఆధ్వర్యాన పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నెలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, వాటి నిర్వహణకు సహకరించాలని కోరారు. చైర్మన్ను కలిసిన వారిలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోచ్లు ఉన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు రైతులు, ప్రజాప్రతినిధులు

కాఫీ రైతులకు న్యాయం జరిగేలా చూస్తా

ప్రజాశక్తి, జికెవీధి : జాతీయరహదారి ఎన్హెచ్516ఇ రోడ్డు నిర్మాణంలో పెదవలస నుండి చాపరాతిపాలెం వరకూ రహదారి ఇరువైపులా కాఫీ తోటలు కోల్పోతున్న రైతులకు తగిన న్యాయం చేస్తామని మండల తహశీల్దార్ హెచ్.అన్నాజీరావు తెలిపారు. పాడేరు సబ్కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పెదవలసలో కాఫీతోటలు, భూములు కోల్పోయే రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందే అవసరం లేదని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ, సర్వేయర్, వీఆర్ఓ, రైతులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెదవలస పిహెచ్సి ఆకస్మిక సందర్శన

కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం

ప్రజాశక్తి- జికెవీధి: జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్మెంట్ అధికారి (ఎన్హెచ్ ఎం) కుష్టువ్యాధి, ఎయిడ్స్, టిబి నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ ఎం.కిరణ్కుమార్ పెదవలస పిహెచ్సిని అకస్మికంగా సందర్శించారు. క్షయ రోగులకు అందిస్తు న్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స రికార్డుల ను, మందులను తనిఖీ చేశారు. ప్రయోగశాలలో ఔషధపంపిణీ, పరీక్షలు చేయడం ద్వారా క్షయ రోగిని పర్యవేక్షించాలని ఫార్మసిస్ట్, ల్యాబ్టెక్నీషి యన్కు సూచిం చారు. ఏవైనా సమస్యలు ఉంటే టిబి యూనిట్ ఎంఒటిసికి తెలియజేయాలని సూచించారు. పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ పద్విషా, డాక్టర్ చందనకుమార్ జీకే వీధి టీబీ యూనిట్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతో ఒత్తిడి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ప్రజల జీవన శైలిలో మార్పులు కారణంగా ఒత్తిడితోపాటు అధిక ఆలోచనలతో ఎక్కువ సమయం గడుపుతున్నట్టు సెంటర్ ఫ్రెష్, యూ గోవ్ సంయుక్తంగా నిర్వహించిన తాజా జాతీయ స్థాయి అధ్యయనం వెల్లడించిందని ఆ సంస్థ ప్రతినిధి గుంజన్ కేతన్ చెప్పారు. బుధవారం బీచ్ రోడ్లో నిర్వహించిన ఇండియా ఓవర్ థింకింగ్ రిపోర్ట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అతి అలోచనలో రోజువారీ జీవనశైలిలో ఎంత ప్రభావవంతగా ఉందో ఈ సర్వే వెల్లడించిందన్నారు.

ఇది సంక్షోభ సమయంలోనే కాకుండా, అత్యంత సాధారణమైన నిర్ణయాల్లో కూడా అతి అలోచనలు కనిపిస్తున్నాయనిఈ నివేదిక చెబుతోందన్నారు. ఇటివలి కాలంలోనే తొలి సారిగా వెలువడిన ఈ 'సెంటర్ ఫ్రెష్ ఇండియా ఓవర్ థింకింగ్ రిపోర్ట్' ప్రకారం, భారతీయులలో 81 శాతం మందికి రోజుకు మూడు గంటలకు పైగా ఓవర్థింకింగ్ చేస్తూ గడిపే అలవాటు ఉందని తెఇపారు. వాట్సాప్ మెసేజ్కి ఎలా స్పందించాలో, భోజనానికి ఏం తినాలో, ఇన్స్టాగ్రామ్లో ఏ ఫోటో పోస్ట్ చేయాలో వంటి చిన్న చిన్న విషయాల విషయంలో కూడా ప్రజలు ఆలోచనల ఊబిలో మునిగిపోతున్నారని ఈ డేటా స్పష్టం చేస్తోందన్నారు. ఈ రిపోర్టు భారతదేశంలోని టైర్ 1, 2, 3 నగరాల్లో నివసించే విద్యార్థులు, ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందినవారి నుండి నిర్వహించినట్లు చెప్పారు. ఆహారం, జీవనశైలి అలవాట్లు, డిజిటల్, సామాజిక జీవితం, డేటింగ్, సంబంధాలు, కెరీర్ ప్రొఫెషనల్ జీవితం అనే అంశాలు ఆధారంగా ఈ సర్వే నిర్వహించినట్టు తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ప్రపంచ ఆదివాసి దినోత్సవం పురస్కరించి ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, దండకారణ్య కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీలో గెలుపొందిన వారికీ బహుమతులు ఇస్తామని ఎస్ఎఫ్ఐ, ఆదివాసి గిరిజన సంఘం నేతలు పి.రామన్న, కె.రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చలపతిరావు, అధ్యాపకులు కె.లక్ష్మి, ఎస్.అన్నపూర్ణ, బి.సరస్వతి, రోజారాణి, లచ్చన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

జీపుజాతాలో సురేంద్ర, నాయకులు

9న సిఎం చంద్రబాబు పాడేరు పర్యటన సందర్భంగా

స్పెషల్ డిఎస్సిపై ప్రకటన చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర
- హుకుంపేటలో ఆదివాసీ యువగళం జీపు జాతా

ప్రజాశక్తి-హుకుంపేట: ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి పాడేరు పర్యటనకు వస్తున్న సందర్భంగా స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్‌పై ప్రకటన విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. హుకుంపేట మండల కేంద్రం బుధవారం ఆదివాసి యువత స్వరాలతో మార్మోగింది. ఆదివాసి స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ, ఆదివాసి నిరుద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదివాసీ యువగళం జీపు జాతా" హుకుంపేట మండలానికి చేరుకుంది. ఈ జీపు జాతా ఒంటిపాక, పెదగరువు, పాతకోట, లివిటి, సన్యసమ్మపాలెం, కొంతిలి, గూడా గ్రామాల మీదుగా సాగింది. అనంతరం హుకుంపేటలో నాలుగు రోడ్ల కూడలిలో వేలాది మంది ఆదివాసులతో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ కో-కన్వీనర్ టి. కృష్ణారావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ గిరిజనులకు 100శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల్లో రిజర్వేషన్ చట్టబద్ధతపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. మెగా డీఎస్సీ నుంచి ఆదివాసి ప్రాంతాల ఉద్యోగాలను మినహాయించి, స్థానిక ఆదివాసి అభ్యర్థులతోనే భర్తీ చేయాలన్నారు. జీపు జాతా రథ సారథులు ధర్మానపడాల్, రాధాకృష్ణ మాట్లాడుతూ, జీపు జాతా చివర రోజున పాడేరు ఐటిడీఏ ఆవరణలో మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. ఆదివాసులు, నిరుద్యోగులు అందరూ వేలాదిమందిగా సభకు తరలి వచ్చి తమ పోరాటానికి మద్దతు పలకాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ సాధన కమిటీ, నిరుద్యోగుల సంఘం నాయకులు నారాయణ, భానుచందర్, నాయుడు, సుధీర్, శంకర్, పృథ్వీ, శ్యామల, భాగ్య, వినయ్, గిరిజన సంఘం నాయకులు టి. అప్పలకొండ, విద్యార్థులు, నిరుద్యోగులు భారీగా పాల్గొన్నారు.

స్పెషలిస్టు వైద్యులను నియమించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని సీహెచ్‌సిలో గైనిక్, చెస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్లను తక్షణమే నియమించాలని సిపిఎం మండల కార్యదర్శి కొర్రా త్రినాథ్, నాయకులు ఎంఎం శ్రీనులు కోరారు. బుధవారం సిహెచ్‌సిలో తనిఖీలకు వచ్చిన డిసి హెచ్ఎస్ డాక్టర్ నీలవేణికి విన్నవించారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడితూ, సిహెచ్‌సీలో సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. గర్భిణీలు, బాలింతలు పదుల సఖ్యలో వస్తున్నప్పటికీ గైనిక్ స్పెషలిస్ట్ సిహెచ్‌సిలో లేక పోవడంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుండె సంబంధిత రోగులు పెరుగుతున్నారని స్పెషలిస్టులు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సిహెచ్‌సిలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న లాబ్ టెక్నిసియన్, పార్మసిస్టు లను నియమించి, పూర్తి స్థాయిలో నర్సు పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డిసిహెచ్ఎస్ డాక్టర్ నీలవేణి స్పందించి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ గీతాంజలి, వైద్యులు సురేశ్ ఉన్నారు.

సమావేశంలో పాల్గొన్న వార్డు మెంబర్లు, పిసా కమిటీ సభ్యులు

హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం

ప్రజాశక్తి- అనంతగిరి: గిరిజన జీవితాలను ఛిద్రం చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టును తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ గుమ్మకోట పంచాయతీ జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. స్థానిక పంచాయతీ సర్పంచ్ పాగి .అప్పారావు నేతృత్వంలో పంచాయతీ. అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించింది. గిరిజన మనుగడను దెబ్బతీస్తూ పచ్చని వ్యవసాయ పంట భూములను నాశనం చేసే ఈ పవర్ ప్రాజెక్టు వద్దంటూ పంచాయతీ వార్డు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ, గుజ్జెలి గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటికే ఆ ప్రాంతంలో రాత్రుల సమయంలో డ్రోన్ కెమెరాలతో సర్వేలు నిర్వహించి, ఎవరికి తెలియకుండా సరిహద్దు మైలు రాళ్ళను ఏర్పాటు చేశారని తెలిపారు.పంచాయతీ పరిధిలో ఉన్న రైతుల విలువైన భూములను కొంతమంది భూస్వాములు ఆక్రమించుకొని వాటి చుట్టూ ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తే గుజ్జలి, గుమ్మకొట, బుర్ధగెడ్డతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో విలువైన భూములు, జీడి మామిడి, టేకు దెబ్బతింటాయన్నారు. దీంతో గిరిజనులు జీవనాన్ని కోల్పోతారన్నారు. గుమ్మకోట గురుకుల పాఠశాల ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కన్నయ్య, వార్డు సభ్యులు శంకర్, కృష్ణ పేసా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

రైతులకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ డెక్కపురం గ్రామంలో పీవీటిజి గిరిజన రైతులకు 10 రకాల పండ్లు మొక్కలను పంపిణీ చేశారు. నాంది హర్షిపల్ ఇండియా ఫౌండేషన్ సంస్థ పంచాయతీ కోఆర్డినేటర్ జె.రమేష్ చేతుల మీదగా బుధవారం 12 మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఒక్కొక్క రైతుకు 400 మొక్కల చొప్పున రెండో దపాలో పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో రైతులు కె.బాలరాజు, ఆనంద్, ప్రసాద్ పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని ఎగువశోభా పంచాయతీ పరిధి మర్దాడ, కొత్తవలస, హెట్కగూడ, జామకూడా, దిగువ శోభ తదితర గ్రామాల్లోని గిరిజన రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను జెడ్పిటిసి దీసరి. గంగరాజు, సర్పంచ్ కొర్రా. సింహాద్రి చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాఫీ తోటల పెంపకంలో భాగంగా ముందుగా సిల్వర్ ఒక్ మొక్కలు పంపిణీ చేస్తుందని, అనంతరం కాపీ తోటల పెంపకానికి ప్రోత్సహిస్తుందని తెలిపారు. విఆర్‌పిలు రాధా, నర్సమ్మ రైతులు పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా ద్వారా నిర్వహించబడుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను గెస్ట్ ప్రాతిపదికన 2025-26 విద్యాసంవత్సరంకు(ఒక సంవత్సరం) కాలానికి భర్తీ చేయుటకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అర్హులైన మహిళా అభ్యర్థులు నుండి దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల విద్యా సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త స్వామి నాయుడు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. బోధన సిబ్బంది ఖాళీల వివరాలు: పిజిటి (మాథ్స్ -1), పిజిటి (ఫిజిక్స్-1), పిజిటి (కెమిస్ట్రీ-1), పిజిటి (జూవాలజీ-1), పిజిటి (సివిక్స్-1) మొత్తం పిజిటి ఖాళీలు-5, సిఆర్టి (తెలుగు-2), సిఆర్టి (హిందీ-1), (ఇంగ్లీషు-1), (ఫిజిక్స్-1), (సోషల్-1) సిఆర్టి మొత్తం-6 ఖాళీలకు ఆసక్తిగల మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను 6-08-2025 నుండి తేదీ నుంచి 10.08.2025 వరకు మీ మండల పరిధిలోని కేజీబివి ప్రిన్సిపల్స్'కి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు వయోపరిమితి: ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18-42 సంవత్సరాలు, ఎస్సీ ఎస్టీ బీసీలకు, ఈడబ్ల్యూఎస్ 5 సంవత్సరాలు, మాజీ సైనిక ఉద్యోగినులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు వయోపరిమితి సడలింపు కలదని పేర్కొన్నారు. పిజిటిలకు ఎన్సీఈఆర్టీ ప్రాంతీయ విద్యా సంస్థ నుండి రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు లేదా యుజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్ డిగ్రీని కలిగి ఉండాలన్నారు. సిఆర్టిలకు ఎన్సీఈఆర్టీ ప్రాంతీయ విద్యా సంస్థ నుండి నాలుగు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సుతో పాటు ఎన్సీటీఈ ద్వారా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల నుండి బిఈడి అర్హత కలిగి ఉండాలని సూచించారు. బయోడేటా ఫారంతో పాటు విద్యార్హత సర్టిఫికేట్లు, కులధృవీకరణ పత్రాలు, ఆధార్ జెరాక్స్ కాపీలు జతచేసి, పూర్తిచేసిన దరఖాస్తులను సంబంధిత మండలంలో కేజీబివి ప్రిన్సిపల్స్ కి అందజేయాలన్నారు. లేదా నేరుగా జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయవచ్చు నని తెలిపారు.

శతశాతం రిజర్వేషన్‌పై ప్రకటన చేయాలి

- గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు
- పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లించాలి
- ఆదివాసీ పండగను విజయవంతం చేయాలి
- ఆదివాసీ గిరిజన సంఘ రాష్ట్ర నాయకులు సీసం సురేష్

చింతూరు : కల్లేరులో ఆదివాసీ జెండా ఆవిష్కరిస్తున్న సీసం సురేష్

రాజఒమ్మంగి : మాట్లాడుతున్న గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం నేపథ్యంలో ప్రభుత్వం ఏజన్సీ ప్రాంతంలో శతశాతం రిజర్వేషన్‌పై ప్రకటన చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, ఆదివాసీ జెఎసి నాయకులు వంతు బాలకృష్ణ, వజ్రపు అప్పారావు తదితరులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో బుధవారం ఆదివాసీ దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి జెఎసి నేతలు లోతా రామారావు, వంతు బాలకృష్ణ, గంపా నాగరాజు, సూరిబాబు, కొండ్ల సూరిబాబు తదితరులు మాట్లాడుతూ ఆర్అండ్‌బి అతిథిగృహం వద్ద అట్టహాసంగా జరిగే ఆదివాసీ దినోత్సవానికి అంతా హాజరుకావాలన్నారు. ఉదయం 9 గంటలకు ఆదివాసీ జెండా ఆవిష్కరణ, ర్యాలీ, తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

చింతూరు : పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడి తక్షణమే పునరావాసం కల్పించడంతో పాటు పరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం కల్లేరులో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జెండాను గ్రామనాయకుడు రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సీసం సురేష్ మాట్లాడుతూ ఏజెన్సీలో పీసా, 1/70, చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో సర్వం కోల్పోతున్న ఆదివాసీలకు పునరావాసం కల్పించడంలో పరిహారం చెల్లించడంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. కోయితోర్ పండుం దక్కడ్ కార్యక్రమానికి అంతా హాజరు కావాలన్నారు. కారం సుబ్బారావు, సోడి చిన్నమ్మి, సోడే కమలమ్మ తదితరులు పాల్గొన్నారు

కూనవరం: గండికొత్తగూడెం గ్రామంలో ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ గిరిజన నాయకులు ఉయిక కన్నయ్య కోయత్తోర్ పండుం దక్కట్ జెండాను బుధవారం ఆవిష్కరించారు. గిరిజన సంఘం మండల నాయకులు పోడియం రామారావు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో అంతా కలిసి రావాలని పండగ ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజనసంఘ నాయకులు పాయం సీతారామయ్య, తెల్లం తమ్మయ్య, తొండ లచ్చయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

విఆర్.పురం: రేఖపల్లి నాయకపోడు దిమ్మ వద్ద ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పాయం లక్ష్మణరావు ఆదివాసీ నాయకపోడు జిల్లా అధ్యక్షులు చిక్కాల బాలకృష్ణ, కొడరెడ్ల సంగం మండల అధ్యక్షులు మూర్ల కనకరెడ్డి, ఆదివాసీ ఏజీఏసి వైస్‌చైర్మన్ వెటకాని మల్లయ్య బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తేదీన రేఖపల్లిలో ఆదివాసీ దినోత్సవం జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు వీర్ల శ్రీనివాసరావు, రేఖపల్లి మాజీ సర్పంచ్ బేతి నాగేశ్వరావు, పీసా అధ్యక్షులు సారా పాండురాజు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: ఆదివాసీ జెండాను ఆవిష్కరిస్తున్న పోడియం రామారావు తదితరులు

విఆర్.పురం: రేఖపల్లిలో సమావేశమైన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

కబడ్డీలో తలపడుతున్న సీలేరు, విజయనగరం జట్లు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఇంటర్ సర్కిల్ కబడ్డీ పోటీలు రెండో రోజు హోరాహోరీగా జరిగాయి. రెండో రోజు బుధవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న క్రీడాజట్లును ఇఇలు రాజేంద్రప్రసాద్, నాగ శ్రీనివాసరావు క్రీడాకారులు పరిచయం చేసుకున్నారు. సీలేరు ఎపి జెన్కో కబడ్డీ జట్టు పోటీల్లో పాల్గొని లీగ్ దశలో చక్కటి ఆట తీరు ప్రదర్శించి విజయవాడ, ఒంగోలు విజయం సాధించగా విజయనగరం జట్లు 19 సీలేరు జట్టు 30 పాయింట్లు సాధించి క్వాటర్ ఫైనల్‌కి చేరుకుంది. ఏలూరుపై తిరుపతి 37 స్కోర్‌తో విజయం సాధించగా శ్రీకాకుళం 39 స్కోరు సాధించి ఆర్టీపిపిపై విజయం సాధించింది. విజయనగరం నార్ల తాతారావు థర్మల్ పవర్‌స్టేషన్ జట్టు తలపడగా విజయనగరం జట్టు విజయం సాధించింది. కోదాడ కేవలం 11 పాయింట్లకు పరిమితం కాగా కడప 29 పాయింట్లతో విజయం సాధించింది. తిరుపతి 38 పాయింట్లు సాధించగా విజయనగరం 16 పాయింట్లు సాధించి పరాజయం పాలయింది. పల్నాడు 29 పాయింట్లతో దూసుకెళ్లగా ఆర్‌టిపిపి 14 పాయింట్లతో పరాజయం పాలైంది. బుధవారం వాతావరణం అనుకూలంగా ఉండడంతో పోటీలకు అంతరాయం లేదని ఇంటర్ సర్కిల్ కబడ్డీ స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు తెలిపారు.

బిఎస్ఎన్ఎల్ బృందాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

బిఎస్ఎన్ఎల్ టీమ్‌కు సన్మానం

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు మండలం ఎడుగురాలపల్లి పంచాయతీకి చెందిన బొడ్డుగూడెం అనే గ్రామానికి ఇదివరకు ఏ నెట్‌వర్క్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే కొన్నాళ్ల క్రితం ప్రైవేట్ నెట్‌వర్క్ వాళ్లు టవర్ వేయగా కొన్ని అనివార్య కారణాలవల్ల ఆ టవర్‌ను కూడా నిలిపివేశారు. తర్వాత బొడ్డుగూడెంలో బిఎస్ఎన్ఎల్ 4జి టవర్‌ని ఏర్పాటుచేసినప్పటికీ సాంకేతిక కారణాలవల్ల టవర్ నిర్మించిన ఆరు నెలల వరకూ నెట్‌వర్క్ రాలేదు. గ్రామస్తులు సంబంధిత అధికారులకు లేఖ ద్వారా ఫిర్యాదు చేస్తే చింతూరు బిఎస్ఎన్ఎల్ ఓఅండ్ఎం ఇంజనీర్ కాశి అతని టీం కలిసి నెట్‌వర్క్ రావడానికి కృషి చేశారు. గ్రామంలో నెట్‌వర్క్ రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులు బిఎస్ఎన్ఎల్ జెటిఒ రవికి సమాచారమిచ్చి బిఎస్ఎన్ఎల్ ఒఅండ్ఎం ఇంజనీర్ కాశిని బిఎస్ఎన్ఎల్ ఇంజనీర్ టీం టెక్నీషియన్స్ దుర్గ, రాముకి సన్మానం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏడుగురాళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి బొడ్డుగూడెం యూత్ మెంబెర్స్ పాల్గొన్నారు.

12న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం :

ఏజెన్సీలో అన్ని పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 12వ తేదీ మంగళవారం నులిపురుగుల (ఆల్బెండజోల్) మాత్రలు వేయిస్తున్నామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం పిఒ చాంబర్ నుండి ఏజెన్సీలో 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో నులిపురుగులు మాత్రలు పంపిణీ చేసే విధంగా ప్రాజెక్ట్ అధికారి వీడియో కాన్ఫరెన్స్, టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అంగన్వాడి కేంద్రాల్లో బాల బాలికలకు, అన్ని పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 12వ తేదీన మాత్రలు వేయించడం జరుగుతుందన్నారు.

అంగన్వాడి కేంద్రాల్లో బాలలకు నులిపురుగు మాత్రలు సగం ముక్క కాచి చల్లార్చిన నీళ్లతో కరగబెట్టి త్రాగించాలన్నారు. నులిపురుగుల మాత్రలు పంపిణీ చేసే విధంగా అడిషనల్ డిఎంహెచ్ఒ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే ప్రస్తుతం మాత్రలు వాడకుండా 15 రోజుల తర్వాత మాత్రలు వేసుకునే విధంగా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డివిఎస్ రమణ, అడిషనల్ డిఎంహెచ్ఒ డేవిడ్, వైద్యాధికారి కెవిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారుల సమావేశంలో పాల్గొన్న పిఒ సింహాచలం

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కేసులు

సీలేరు రేషన్ డిపో తనిఖీ చేస్తున్న తహాశీల్దార్

ప్రజాశక్తి -సీలేరు: ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తానని జికె వీధి తహశీల్దార్ అన్నాజీరావు హెచ్చరించారు. బుధవారం జికె వీధి మండలం సీలేరు దారకొండలో విస్తతంగా పర్యటించారు. దారకొండ జిసిసి రేషన్ డిపోలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీలేరు డిపోలో తూనికలు సక్రమంగా ఉన్నాయా లేదా అని తహశీల్దార్ ఆరా తీసి రికార్డులు స్టాకు రిజిస్టర్ పరిశీలించారు. ప్రతినెలా సకాలంలో రేషన్ సరుకులు లబ్ధిదారులకి అందజేయాలని ఆదేశించారు. పార్వతినగర్‌లో గ్రామస్తులతో సమావేశం అయ్యారు. అంగన్‌వాడి భవనానికి స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా పంపుస్టోరేజ్ ప్రాజెక్టు వలన తమకి నష్టం వాటిల్లుతుందని ఇళ్లు కోల్పోతున్నామని గ్రామస్తులు తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తానని తహశీల్దార్ హామీ ఇచ్చారు. సీలేరులో 1350 మెగావాట్ల సామర్థ్యంతో త్వరలో నెలకొల్పబోయే పంపు స్టోరేజ్‌ప్రాజెక్టు హద్దులను మెఘా కంపెనీ ఇంజీనీర్లతో తహశీల్దార్ పరిశీలించారు. మార్కింగ్‌ని పరిశీలించారు.అనంతరం జొన్న మామిడిలో మొల్లు సాంబమూర్తి రెవెన్యూ భూమి హద్దులు పరిశీలించారు. ఈ సర్పంచ్ పాంగిదుర్గో ఆర్ఐ బాలమునాయుడు వీఆర్ఒ దేవదాసు సర్వేయర్ శ్రీనివాస్ పంచాయతీ సర్వేయర్ మురళి తదితరులు పాల్గొన్నారు.